క్లుప్తంగా

ఎక్సైజ్ అధికారుల దాడులు



పట్టుకున్న మద్యంతో ఎక్సైజ్ అధికారులు

దహెగాం: ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్ అధికారులు గుడుంబా స్థావరాలపై, బెల్టు దుకాణాలపై దాడులు నిర్వహిస్తున్నారు. సోమవారం జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతికిరణ్ ఆదేశాల మేరకు మండలంలోని చౌక గ్రామంలో కొలిపాక శ్రీకాంత్ ఇంట్లో సోదాలు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ మంగమ్మ తెలిపారు. ఇంట్లో సోదాలు చేయగా అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం స్వాధీనం చేసుకొని, అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై కిషన్, సిబ్బంది పాల్గొన్నారు.

23న సత్యసాయి జయంతి వేడుకలు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని సత్యసాయి సదన్‌లో ఈ నెల 23న భగవాన్ సత్యసాయి 93వ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సేవా సమితి కన్వీనర్ తణుకు దత్తాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 5.30 గంటలకు ఓంకారం, సాయి సుప్రభాతం, నగర సంకీర్తన, 6.30 గంటలకు ప్రశాంతి పతాకావిష్కరణ, 7 గంటలకు అష్టోత్తర శతనామావళి పారాయణం, గాయత్రీ హోమం, మధ్యాహ్నం 1 గంట నుంచి అన్నప్రసాద వితరణ, సాయంత్రం 5 గంటలకు 98 దీపాలచే అలంకరణ, 6 గంటలకు భజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

రేపు అయ్యప్పస్వామి ఆలయంలో సమావేశం

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా కేంద్రంలోని శ్రీ హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించనున్నట్లు అయ్యప్ప సేవాసమితి, ఆలయ కమిటీ ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అయ్యప్ప మాలధారణ చేసే భక్తులు, ఇతర భక్తులు పూర్తిస్థాయిలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

టోంకినికి భక్తుల పాదయాత్ర



పాదయాత్రగా బయలుదేరిన భక్తులు

కెరమెరి: మండలంలోని సావర్‌ఖెడా గ్రామానికి చెందిన ఆంజనేయ స్వామి భక్తులు సోమవారం సిర్పూర్(టి) మండలంలోని టోంకిని గ్రామానికి పాదయాత్రగా బయలుదేరారు. నేడు టోంకినిలో నిర్వహించే ఆంజనేయ స్వామి ఉత్సవంలో పాల్గొనేందుకు 30 మంది యువకులు 65 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టారు. మహాశివరాత్రి పవిత్ర మాసం పర్వదినాన్ని పురస్కరించుకొని అంజన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు యువకులు తెలిపారు.

ఖిరిడి పాఠశాలలో వైద్య శిబిరం



విద్యార్థులతో మాట్లాడుతున్న వైద్య సిబ్బంది

వాంకిడి: మండలంలోని ఖిరిడి ప్రాథమిక పాఠశాలలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వ్యక్తిగత పరిశుభ్రతపై పిల్లలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో పర్యటించి పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ చర్యలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య విస్తరణ అధికారి పెందుర్ రవిదాస్, ఎమ్ఎల్‌హెచ్‌పీ స్వప్న, ఏఎన్ఎం కృష్ణకుమారి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పుస్తక ప్రదర్శన

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు వివిధ రకాల పుస్తకాలతో పాటు పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలపై అవగాహన కల్పించారు. అనంతరం పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజు, గ్రంథాలయ అధికారి దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.

చలికి గజగజ!

- గిన్నెదరిలో ఏటా నమోదవుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు
- ఉదయం 8 దాటినా తగ్గని చలి ప్రభావం
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

గత మూడు రోజులుగా గిన్నెదరిలో నమోదైన కనిష్ట ఉష్ణోగ్రతలు..	
ఈనెల 17న	13.5 డిగ్రీలు
18న	13.9 డిగ్రీలు
19న	14.6 డిగ్రీలు



తిర్యాణిలో చలి మంటలు కాగుతున్న గిరిజనులు

తిర్యాణి: చుట్టూ దట్టమైన అడవులతో నిండి ఉన్న తిర్యాణి మండల ప్రజలను చలి వణికిస్తోంది. సీజన్ ప్రారంభంలోనే కనిష్ట ఉష్ణోగ్రతలు 10 డిగ్రీలకు చేరువవుతున్నాయి. చలికి తోడు శీతల గాలులు వీస్తుండడంతో వృద్ధులు, చిన్నారులు తిప్పలు పడుతున్నారు. ఉదయం 8 గంటలు దాటినా చలి ప్రభావం తగ్గడం లేదు. ప్రతీ సీజన్‌లో రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు మండలంలోని గిన్నెదరిలో నమోదవుతున్నాయి. కాగా రెండేళ్ల క్రితం రాష్ట్రంలోనే అత్యల్పంగా గిన్నెదరి గ్రామంలో 3.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదయ్యింది.

తగ్గని చలి ప్రభావం..

చలి తీవ్రతతో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రజలు ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. ఉదయం 8 గంటలు దాటినా చలి తీవ్రత ఏమాత్రం తగ్గడం లేదు. సాయంత్రం నాలుగు, ఐదు గంటలు అయ్యిందంటే చాలు చలి మొదలవుతుంది. చల్లని ఈదురుగాలులు వీస్తుండటంతో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. పెరుగుతున్న చలి ప్రభావంతో జిల్లా వాసులు వణికిపోతున్నారు. రాత్రి 8 గంటలకు ఇళ్ల తలుపులు మూసి వేస్తున్నారు. చలి నుంచి రక్షణ పొందడానికి స్వెటర్లు, మంకీ క్యాప్‌లు ధరించడంతో పాటు గ్రామాల్లో చలి మంటలు కాగుతున్నారు. కాగా రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పడిపోయే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

చలితో తప్పని ఇబ్బందులు..

చలి తీవ్రత సాయంత్రం 5 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకూ తీవ్రంగా ఉంటుండడంతో వృద్ధులు, చిన్నారులు తిప్పలు పడుతున్నారు. చలితో శరీరంలోని తేమ కోల్పోయి చర్మం పొడి బారడంతో పాటు పెదాలు, కాళ్లు, చేతులు పగుళ్లు ఏర్పడుతున్నాయి. పిల్లలు, వృద్ధుల్లో చలి తీవ్రతకు జలుబు, ఆస్తమా, ఎలర్జీ వ్యాధుల బారిన పడే ప్రమాదం కూడా ఉంది. వాతావరణ పరిస్థితుల కారణంగా చిన్నపిల్లల్లో వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు.

జాగ్రత్తలు పాటించాలి

రోజురోజుకూ కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతున్న నేపథ్యంలో చలి నుంచి రక్షణ కోసం జాగ్రత్తలు తీసుకోవాలి. వృద్ధులు, చిన్నారులు చలిలో బయటకు వెళ్లకపోవడమే మంచిది. అనారోగ్యానికి గురైతే వెంటనే వైద్యులను సంప్రదించాలి. చలి నుంచి రక్షణ కోసం ప్రతీరోజు 4 నుంచి 5 లీటర్ల నీటిని తీసుకోవాలి. శరీర ఉష్ణోగ్రతలు పడిపోకుండా చూసుకోవాలి.

– హర్షవర్ధన్, పీహెచ్‌సీ వైద్యుడు, తిర్యాణి

సమస్యల 'బడులు'



ఇందాపూర్‌లో నిలిచిపోయిన పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణం

కెరమెరి: మండలంలోని ఇందాపూర్, దేవుడ్‌పల్లిలో ప్రభుత్వ పాఠశాలలు సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇందాపూర్‌లో ఉన్న పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. అదనపు తరగతి గదుల కోసం ఆరేళ్ల క్రితం చేపట్టిన నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దేవుడ్‌పల్లిలో నిర్మించిన మరుగుదొడ్లు నీరు లేక నిరుపయోగంగా మారాయి. మండలంలోని పలు పాఠశాలల్లో నిర్మించిన మంచినీటి ట్యాంకులు అలంకారప్రాయంగా ఉన్నాయి. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



శిథిలావస్థలో ఇందాపూర్ పాఠశాల



నిరుపయోగంగా మారిన మరుగుదొడ్లు

'ఎఫ్‌ఆర్‌ఎస్'లో హాజరు నమోదు చేయాలి



సుర్దాపూర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో

కెరమెరి: ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌లో విద్యార్థుల హాజరును ప్రతీరోజు నమోదు చేయాలని మండల విద్యాధికారి కుడ్మెత సుధాకర్ అన్నారు. సోమవారం మండలంలోని ఝరి, సుర్దాపూర్ ప్రభుత్వ పాఠశాలలను ఆయన సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. యూడైస్‌లో, హాజరు రిజిస్టర్లలో విద్యార్థులు సమానంగా ఉండాలన్నారు. ఇటీవల ప్రారంభించిన సీఎం బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అనంతరం వివిధ రికార్డులు పరిశీలించారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



చిత్రకళను వివరిస్తున్న ఉపాధ్యాయుడు

బెల్లంపల్లి: ఓ ఉత్తమ పుస్తకం మానవ జీవితాన్ని ఎంతగానో ప్రభావితం చేసి దిక్సూచిగా నిలుస్తోందని బెల్లంపల్లి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సీఓఈ కళాశాల ప్రిన్సిపాల్ ఐనాల సైదులు అన్నారు. కళాశాలలో సోమవారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడారు. పుస్తక పఠనంతోనే విజ్ఞానం పెరుగుతుందని, జ్ఞాన సముపార్జనకు పుస్తకాలు ఎంతో దోహదపడుతాయన్నారు. విద్యార్థులు గ్రంథాలయాన్ని సందర్శించడం, మంచి పుస్తకాలు చదవడం అలవాటుగా చేసుకోవాలన్నారు. మహానుభావుల జీవిత చరిత్రలను అధ్యయనం చేయాలని సూచించారు. గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకుని నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అంతకుముందు అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది బాలల హక్కులను పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. లైబ్రేరియన్ ఎండీ కౌసర్, ఆర్ట్ ఉపాధ్యాయుడు అశోక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు పరిశీలన



పొనకల్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పరిశీలకులు

జన్నారం: మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సామవారం సాయంత్రం జనరల్ అబ్జర్వర్ కె.గోపాలకృష్ణన్ పరిశీలించారు. పొనకల్, దొంగపల్లి, హస్టల్‌తండా, లోతొర్రే, బాదంపల్లి, రేండ్లగూడ, కలమడుగు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ప్రజలతో మాట్లాడారు. అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. తహసీల్దార్ వేణుగోపాల్, ఎస్సై సతీశ్, ఎంపీడీవో అరుణరాణి, ఆర్ఐ భానుచందర్ ఉన్నారు.

బాలల హక్కులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కోఆర్డినేటర్ సత్యం

నెన్నెల: బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా మండలంలోని కుశ్నపల్లి ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు బాలల హక్కులు, వివిధ చట్టాలపై డయాటిస్ ఆఫ్ ఆదిలాబాద్ ఉమెన్ ప్రమోషన్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కల్పించారు. కోఆర్డినేటర్లు సత్యనారాయణ, దేవదాస్ మాట్లాడుతూ ఒకటి జీవించే హక్కు, రెండు అభివృద్ధి చెందే హక్కు, మూడు రక్షణ పొందే హక్కు, నాలుగు భాగస్వామ్య హక్కు ఈ నాలుగింటిని వివరించారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. పాఠశాలలో కూరగాయల సాగు కోసం సంస్థ తరఫున విత్తనాలు అందజేశారు. సభ్యుడు శేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సెక్టోరియల్ అధికారులకు శిక్షణ



శిక్షణ ఇస్తున్న ఆర్వో సిడాం దత్తు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెక్టోరియల్ అధికారులకు ఆర్వో సిడాం దత్తు సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈవీఎంలకు బ్యాలెట్ పేపర్లు ఎలా పెట్టాలి, వాటిని ఎలా ముగించాలనే వివరాలను తెలియజేశారు. చెన్నూర్, మందమర్రి మండలాల తహసీల్దార్లు మల్లికార్జున్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నీరు పోసిన సిబ్బంది

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామంలో హనుమాన్ ఆలయ ఆవరణలో హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు నీళ్ల అందక ఎండుతున్నాయి. దీనిపై సాక్షిలో ఈనెల 20న 'ఎండుతున్న హరిత మొక్కలు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు సోమవారం సిబ్బంది పంచాయతీ ట్రాక్టర్ ద్వారా మొక్కలకు నీరు అందించారు.



మొక్కలకు నీరు పోస్తున్న సిబ్బంది

22న సర్వసభ్య సమావేశం

చింతలమానెపల్లి: ఈనెల 22న బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సుధాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందన్నారు. గౌరవ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నెన్నెల: మండలంలోని గొల్లపల్లికి చెందిన బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు లింగంపల్లి రాజం తల్లి ఎల్లక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సోమవారం వారి ఇంటికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మండల అధ్యక్షుడు సాగర్‌గౌడ్, సర్పంచ్ ఇందూరి శశికళ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇందూరి రమేశ్, కార్యకర్తలు ఉన్నారు.

ఆర్కే 5గనిలో గుండెజబ్బులపై అవగాహన

శ్రీరాంపూర్: గుండెజబ్బులకు దూరంగా ఉండాలని సింగరేణి హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకనాథ్‌రెడ్డి తెలిపారు. శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఆర్కే 5 గనిలో గుండె జబ్బులపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండె జబ్బులు రాకుండా ప్రతీరోజు పీచు పదార్థాలు, అధిక ప్రోటీన్ ఆహారం, ఆకుకూరలు తాజా పండ్లు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు బీపీ, షుగర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. గని మేనేజర్ సాయిప్రసాద్, రక్షణ అధికారి రవిశంకర్, అండర్ మేనేజర్లో రవీందర్, వెంకట్రాజం, లక్ష్మణ్, శశాంక్, గని ఇంజనీర్ సుధీర్‌రెడ్డి, వెంటిలేషన్ అధికారి జగదీశ్వరరావు, సంక్షేమ అధికారి సంతన్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి

ఇచ్చోడ: ప్రతిఒక్కరూ ఓటును వినియోగించుకోవాలని సూపర్‌వైజర్లు సుర్‌సింగ్, సూర్యప్రకాశ్‌లు కోరారు. సోమవారం మండల కేంద్రంలోని 11వ పోలింగ్ స్టేషన్ పరిధిలో ఇంటింటా తిరుగుతూ పోలింగ్ చీటీలు పంపిణీ చేశారు. ప్రజాస్వామ్యదేశంలో ఓటు చాలా పవిత్రమైందన్నారు.

ఆర్థిక సాయం

నేరడిగొండ: మండలంలోని బుగ్గారం(బి) గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త కమలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది అండగా నిలిచారు. ఇటీవల ఆమెకు బ్రెస్ట్ క్యాన్సర్ ఆపరేషన్ జరగడంతో సోమవారం ఆమె నివాసానికి చేరుకొని పీహెచ్‌సీ వైద్యాధికారి సద్దాం హుస్సేన్ చేతుల మీదుగా రూ.30వేల నగదు అందజేశారు.

అనారోగ్యంతో పంచాయతీ కార్యదర్శి మృతి



రాజేశ్వరి(ఫైల్)

జన్నారం: మండలంలోని చింతగూడ గ్రామ కార్యదర్శి గుర్రపు రాజేశ్వరి (38) అనారోగ్యంతో మృతిచెందింది. కుటుంబీకులు తెలిపిన వివరాలు.. జన్నారం గ్రామానికి చెందిన గుర్రపు నర్సయ్య, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె రాజేశ్వరి. 2014లో కార్యదర్శిగా నియామకం అయ్యారు. చింతగూడలో ప్రస్తుతం పనిచేస్తున్నారు. రాజేశ్వరి గతేడాది అనారోగ్యానికి గురవడంతో ఆసుపత్రిలో పరీక్ష చేసుకోగా క్యాన్సర్ అని తేలింది. చికిత్స పొంది మూడునెలల క్రితం తిరిగి విధుల్లోకి హాజరయ్యారు. ఈనెల 18న అనారోగ్యానికి గురైన ఆమెను ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సామవారం మృతిచెందినట్లు తెలిపారు.

విద్యార్థులపై శ్రద్ధ చూపాలి



మాట్లాడుతున్న హెచ్‌ఎం హన్మంతు

కౌటాల: విద్యార్థుల చదివే సామర్థ్యాలపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం జి.హన్మంతు అన్నారు. సోమవారం మండలంలోని తాటిపల్లి, గోవర్‌హెట్టి, వీరవెల్లిలోని గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో తొలిమెట్టు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని తెలిపారు. ఆయన వెంట సీఆర్‌పీ గంధం ప్రకాశ్, తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్



పాఠశాలలో ప్రదర్శనలు చేస్తున్న విద్యార్థులు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామంలోని విజేత ఇంగ్లిశ్ మీడియం హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ ఆకట్టుకుంది. చంద్రయాన్–3 మోడల్‌తోపాటు గడ్డి కోతయంత్రం, పర్యావరణ మార్పుల ప్రాజెక్టు, మానవ రక్తప్రసరణ వ్యవస్థ పనిచేసే విధానం, గణిత ఫార్ములా, బ్యాక్టీరియా ఇన్ మోడల్ ప్రజెంటేషన్‌ను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పరిశీలించారు. కార్యక్రమంలో డైరెక్టర్ మదిరె శ్రీనివాస్, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్, ఉపాధ్యాయులు సుధాకర్, సుస్మిత, నరేశ్, గౌరి తదితరులున్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలల దినోత్సవం

ఆదిలాబాద్‌రూరల్: మహిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని అంకోలి ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు దశరథ్, సమీరుల్లా ఖాన్‌లు అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం ప్రాముఖ్యత, పిల్లల కోసం కల్పించిన హక్కులను విద్యార్థులకు వివరించారు. పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్ అంతర్జాతీయ బాలల హక్కుల నేపథ్యం, ఆవశ్యకతను వివరించారు. చైల్డ్ లైన్ 1098 కోఆర్డినేటర్ సతీష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కంటె నర్సయ్య, డీసీపీవో రాజేంద్రప్రసాద్, మహిత ప్రోగ్రాం మేనేజర్ శ్రీకాంత్ రావు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

నర్సాపూర్(జి): ధనం, మద్యం వంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రజలు ధైర్యంగా ఓటు వేయాలని నిర్మల్‌రూరల్ సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని టెంబుర్ని గ్రామంలో సోమవారం బీఎస్ఎఫ్ బలగాలు, స్థానిక పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సైలు రవీందర్, అరాఫత్ అలీ, బలగాలు, సిబ్బంది పాల్గొన్నారు.

లోకేశ్వరం: అవాంఛనీయ ఘటనలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ముధోల్ సీఐ వినోద్ అన్నారు. సోమవారం మండలంలోని నగర్, గడ్‌చాంద గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. అనంతరం వాహనాల తనిఖీ చేపట్టారు. వారి వెంట లోకేశ్వరం ఎస్సై సాయికుమార్, సిబ్బంది ఉన్నారు.

దిలావర్‌పూర్: మండలంలోని గుండంపల్లి గ్రామంలో సోమవారం బీఎస్ఎఫ్ జవాన్లు, స్థానిక పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. నిర్మల్‌రూరల్ సీఐ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ స్వేచ్ఛగా ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దిలావర్‌పూర్ ఎస్సై యాసిర్ అరాఫత్, జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

కాసిపేట: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధి చొప్పరిపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద సోమవారం ఉదయం మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి వాహనాల తనిఖీ చేశారు. సీఆర్పీఎఫ్ మహిళా బెటాలియన్‌తో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో విధి నిర్వహణను పరిశీలించారు. పోలీస్ సిబ్బంది, టీం ఇన్‌చార్జి పాల్గొన్నారు.